ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 263 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 29 డిసెంబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

# మన్మోహన్ సింగ్‌కు తుది వీడ్కోలు

## నిగమ్‌బోధ్ ఘాట్‌లో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

### నివాళి అర్పించిన రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి ధన్‌కడ్

### ప్రధాని మోడీ, మంత్రులు, స్పీకర్ తదితరులు

### కాంగ్రెస్ కార్యాలయం నుంచి ఘాట్ వరకు అంతిమయాత్ర



**న్యూఢిల్లీ, డిసెంబర్ 28 (ప్రభాత ఉదయం):** ఇక సెలవ్ అంటూ ఆర్థికవేత్త మన్మోహన్ నింగికేగారు. దివంగత మాజీ ప్రధానికి వీడ్కోలు పలికారు. దివికేగిన దివంగత నేతకు ప్రముఖులు కడసారి శ్రద్ధాంజలి ఘటించారు. అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు ముగిశాయి. ఢిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో ఆయన పార్థివదేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పాడె మోశారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, కిరణ్ రిజిజు, కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా హాజరై మాజీ ప్రధానికి తుది వీడ్కోలు పలికారు. త్రివిధ దళాల అధిపతులు మన్మోహన్‌కు ..మిగతా 2లో



## మన్మోహన్‌సింగ్ అంత్యక్రియల విషయంలో వివాదం

సంప్రదాయాలు పాటించలేదని
కాంగ్రెస్ విమర్శలు
గతంలో మీరేం చేశారో
తెలుసంటూ బిజెపి ప్రతి విమర్శలు
తాజాగా పివికి జరిగిన
అవమానంపై సర్వత్రా చర్చ

2



# బడుగుల గళం పీజేఆర్

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళి

**హైదరాబాద్, డిసెంబర్ 28 (ప్రభాత ఉదయం):** పేద ప్రజలకు అన్ని వేళలా అండగా నిలిచిన వ్యక్తి మాజీ మంత్రి పి.జనార్దన్ రెడ్డి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. పీజేఆర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి పూలమాల వేసి నివాళు లర్పించారు. 1994 నుంచి 1999 వరకు సీఎల్పీ నేతగా ఆయన పని చేసిన ఆయన నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడారని, తెలంగాణ వాదానికి బలమైన గొంతుకగా నిలిచారని సీఎం తెలిపారు. కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం రోజే పిజెఆర్ గుండెపోటుతో హఠాన్మరణం చెందారు.

# మన్మోహన్‌కు నివాళి కోసం అసెంబ్లీ భేటీ

## 30న ప్రత్యేక సమావేశం ఏర్పాటు



**హైదరాబాద్, డిసెంబర్ 28 (ప్రభాత ఉదయం):** దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళి అర్పించేందుకు తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఈ నెల 30వ తేదీన జరగనుంది. సోమవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కానుంది. సంతాప దినాల్లో భాగంగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు శాసన సభ నివాళులర్పించనుంది. మాజీ ప్రధాని, ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్(92) గురువారం రాత్రి కన్నుమూశారు. గత కొన్నాళ్లుగా వృద్ధాప్య సంబంధ సమస్యలతో బాధపడుతున్న ఆయన గురువారం రాత్రి స్పృహ కోల్పోవడంతో కుటుంబసభ్యులు దవాఖానకు తరలించారు. దాదాపు గంటన్నర పాటు ఆయనకు చికిత్స అందించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని, 9.51 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారని ఎయిమ్స్ ప్రకటించింది. మన్మోహన్ మృతికి సంతాప సూచకంగా కేంద్ర ప్రభుత్వం 7 రోజుల సంతాప దినాలను కూడా ప్రకటించింది.

# బొకేల బదులు పుస్తకాలు ఇవ్వండి

## బుక్ ఫెయిర్‌ను సందర్శించిన గవర్నర్



**హైదరాబాద్, డిసెంబర్ 28 (ప్రభాత ఉదయం):** శుభకార్యాలకు వెళ్లినప్పుడు బొకేలకు బదులుగా పుస్తకాలు ఇవ్వాలని తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సూచించారు. శనివారం ఆయన హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను సందర్శించి మాట్లాడారు. 'పుస్తకాల్లో అనంతమైన జ్ఞానం ఉంది. నిరక్షరాస్యుల కోసం ఆడియో బుక్స్ కూడా అందుబాటులోకి ..మిగతా 2లో



# ఫార్ములా ఈ-రేసు కేసు

## కేటీఆర్‌కు ఈడీ నోటీసులు

**హైదరాబాద్, డిసెంబర్ 28 (ప్రభాత ఉదయం):** ఫార్ములా ఈ-రేసు కేసులో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు ఈడీ నోటీసులు ఇచ్చింది. జనవరి 7న విచారణకు రావాలని అందులో పేర్కొన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌కు, హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డికి కూడా ఈడీ నోటీసులు ఇచ్చింది. జనవరి 2, 3న విచారణకు రావాలని అరవింద్, బీఎల్ఎన్ రెడ్డికి ఇచ్చిన నోటీసుల్లో పేర్కొన్నారు. ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా పీఎంఎల్ఏ కింద ఈడీ విచారణ చేస్తోంది.

# కొత్త ఏడాదిలో
# మరింత దూకుడు

## ఆక్రమణలన్నీ రికార్డు చేస్తున్నాం

### చెరువుల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం

### అక్రమ నిర్మాణాల కూల్చివేతలకు 15 బృందాలు

### హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి



**హైదరాబాద్, డిసెంబర్ 28 (ప్రభాత ఉదయం):** కొత్త సంవత్సరంలో హైడ్రా మరింత దూకుడు పెంచుతుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. కూల్చివేతలు ఆగలేదు.. ఇంకా ఉంటాయని స్పష్టంచేశారు. చెరువుల హద్దులపై గ్రౌండ్ వర్క్ జరుగుతోందని అన్నారు. స్పష్టత రాగానే హైడ్రా యాక్టివ్‌గా ఉంటుందని తెలిపారు. చెరువులను అభివృద్ధి చేస్తూ.. అక్రమ నిర్మాణాలు కూల్చేస్తామని స్పష్టం చేశారు. ఎల్టిఎఫ్ నిర్ధారణ అనంతరం అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని చెప్పారు. ఇందుకోసం 15 హైడ్రా బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. భాగ్యనగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కఠినంగానే ఉంటుందని తేల్చిచెప్పారు. అక్రమ నిర్మాణాలపై ప్రజల్లో అవగాహన కల్పించామని తెలిపారు. హైడ్రాకు త్వరలో ఒక ఎఫ్ఎం ఛానల్‌కు ప్రయత్నిస్తున్నాం. హైడ్రా వల్ల ప్రజల్లో భూములు, ఇల్లు క్రయవిక్రయాలపై అవగాహన పెరుగుతుంది. నగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై ..మిగతా 2లో



## తెలంగాణ నేతల
# సిఫార్సులకు నో

### ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్న ఇవో

**తిరుమల, డిసెంబర్ 28 (ప్రభాత ఉదయం):** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను స్వీకరిస్తున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. తెలంగాణ లీడర్ల విజ్ఞప్తి మేరకు సానుకూలంగా స్పందించి వారంలో రెండు రోజులు సిఫారసు లేఖలు స్వీకరించేందుకు టీటీడీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు గుప్పుమన్నాయి. ఈ క్రమంలో తెలంగాణ రాజకీయ నాయకుల సిఫారసు లేఖల స్వీకరణపై టీటీడీ ఈవో శ్యామల రావు కుండబద్దలు కొట్టారు. తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలు స్వీకరిస్తున్నట్లు జరుగుతోన్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు ..మిగతా 2లో



# కొత్త ఏడాదిలో మరింత దూకుడు

**మొదటి పేజీ తరువాయి...**

హైడ్రా కఠినంగానే ఉంటుంది. జూలై తర్వాత అనధికారికంగా, వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించేవాటిపై చర్యలు తప్పవు. వచ్చే ఏడాది నుంచి ప్రతి సోమవారం గ్రీవెన్ సెల్ ఏర్పాటు చేస్తున్నాం. ఎఫ్‌టీఎల్‌లో ఉన్న షెడ్లపై ప్రజలెవరు అద్దెకు తీసుకోవద్దు. ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తున్నాం' అని రంగనాథ్ వెల్లడించారు. 2024 జూలై 19వ తేదీన హైడ్రా ఆవిర్భవించిందని అన్నారు. హైడ్రా 5 నెలల పని తీరు, వచ్చే ఏడాది కార్యాచరణను ప్రకటిస్తున్నామని రంగనాథ్ తెలిపారు. శనివారం హైడ్రా కార్యాలయంలో రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. 2050 కిలోమీటర్ల పరిధి.. తెలంగాణలో 33 శాతం హైడ్రా పరిధిలోకి వస్తుందని స్పష్టం చేశారు. హైడ్రా ఇప్పటికే 200 ఎకరాల భూమిని కాపాడిందని గుర్తుచేశారు. ఇప్పటివరకు 8 చెరువులు, 12 పార్కులను కాపాడామని అన్నారు. ఈ:ఉ, బఫర్ జోన్‌లపై ప్రజల్లో అవగాహన పెరిగిందని రంగనాథ్ పేర్కొన్నారు. త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కొత్తగా 1025 చెరువుల హద్దులను ఏర్పాటు చేస్తున్నామని రంగనాథ్ చెప్పారు. హైదరాబాద్‌లో హైడ్రా సమాచారం చేరవేయడం కోసం ఓ ఈఓ రేడియో ప్రారంభిస్తామని తెలిపారు. జూలై 19వ తేదీకు ముందు తర్వాత అక్రమ కట్టడాలను శాటిలైట్ ఇమేజ్ ద్వారా గుర్తిస్తున్నామని అన్నారు. అక్రమ నిర్మాణాలు కూల్చివేయడమే హైడ్రా పని కాదని.. 12 చెరువులను పునరుద్ధరణ చేస్తున్నామని చెప్పారు. డీఆర్ఎఫ్‌లో 72 టీమ్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. క్షఖీఖీ వరకు డీఆర్ఎఫ్ పని చేస్తుందన్నారు. కొంత మంది హైడ్రాపై అసత్య ప్రచారం చేస్తున్నారు.. దానిని ఖండిస్తున్నామని రంగనాథ్ అన్నారు.'హైడ్రా ఏర్పడి దాదాపు 5 నెలలు దాటింది. ఐదు నెలల అనుభవాలు, వచ్చే ఏడాది రూట్ మ్యాప్ సిద్ధం చేశాం. హెచ్ఎండిఎ వరకు హైడ్రా పరిధి ఉంది. జీహెచ్ఎంసీ చట్టం కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అధికారులను కేటాయించింది. 200 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించాం. 12 చెరువులు, 8 పార్కులను అన్యాక్రాంతం కాకుండా హైడ్రా కాపాడింది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌పై ప్రజల్లో అవగాహన పెరిగింది. 1095 చెరువుల్లో వచ్చే ఏడాది ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేస్తాం. సాంకేతిక పరిజ్ఞానం, డాటాతో ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేస్తాం. ఎఫ్‌టీఎల్‌ను పారదర్శకంగా చేయడం మా బాధ్యత. శాటిలైట్ ఇమేజ్‌తో అత్యంత రెజల్యూషన్ ఉన్న డేటా తీసుకుంటున్నాం. 2006 నుంచి 2023 వరకు ఏరియల్ డ్రోన్స్‌తో తీసిన ఫొటోలను కూడా ఎఫ్‌టీఎల్ నిర్ధారణ కోసం తీసుకుంటున్నాం. ఎఫ్‌టీఎల్ మారడానికి గల కారణాలు స్పష్టంగా తెలుస్తుంది. శాస్త్రీయమైన పద్ధతుల్లోనే ఎఫ్‌టీఎల్ నిర్ధారణ జరుగుతుంది. నాలాలపై కిర్లోస్కర్ కంపెనీ చేసిన స్టడీని తీసుకుంటున్నాం. 5800 ఫిర్యాదులు హైడ్రాకు అందాయి. అనధికారిక నిర్మాణాలకు సంబంధించి 27 పురపారక సంఘాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి' అని రంగనాథ్ పేర్కొన్నారు.

'27 పురపాలక సంఘాలపై కూడా మాకు అధికారం ఉంది. శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా ఆక్రమణలను గుర్తిస్తున్నాం. భవన నిర్మాణ వ్యర్థాల డంపింగ్‌పై కూడా దృష్టి పెట్టాం. 2025లో జియో ఫెన్సింగ్ సర్వే చేస్తాం. 12 చెరువుల పునరుద్ధరణకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. త్వరలోనే 72 డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులోకి వస్తాయి. నాగోల్‌లో ఉన్న డీఆర్ఎఫ్ కేంద్రాన్ని బలోపేతం చేస్తాం. త్వరలోనే నగరంలో మరో డాప్లర్ వెదర్ రాడార్ రాబోతుంది. వెదర్ డాటాను విశ్లేషించేందుకు హైడ్రాలో ఒక టీంను ఏర్పాటు చేస్తున్నాం అని అన్నారు.

## తెలంగాణ నేతల సిఫార్సులకు నో

**మొదటి పేజీ తరువాయి...**

లేఖలను స్వీకరిస్తున్నట్లు వస్తున్న వార్తలు నిజం కాదని తెలిపారు. మీడియాలో అలా ప్రచారం జరుగుతోందని.. కానీ తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖల స్వీకరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఈవో శ్యామల రావు వివరణ ఇచ్చారు. ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమలలో తెలంగాణ లీడర్ల సిఫారసు లేఖలు స్వీకరించకపోవడంపై రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ టీటీడీ తీరును బహిరంగంగానే తప్పుబట్టారు. తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలు స్వీకరించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే తెలంగాణ లీడర్ల సిఫారసు లేఖలు స్వీకరించేందుకు టీటీడీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని.. వారంలో రెండు రోజులు సిఫారసు లేఖలపై దర్శనానికి అవకాశం కల్పించినట్లు మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు వెలువడ్డాయి. దీంతో అప్రమత్తమైన టీటీడీ ఈవో శ్యామల రావు.. తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖల స్వీకరణపై క్లారిటీ ఇచ్చారు. తెలంగాణ లీడర్ల లేఖలపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు.




## అన్నా వర్సిటీలో విద్యార్థిపై అత్యాచారం

### మహిళా పోలీస్ అధికారితో సిట్ ఏర్పాటు

### తమిళనాడు ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టు ఆదేశం

**చెన్నై, డిసెంబర్ 28 (ప్రభాత ఉదయం):** అన్నా యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థినిపై జరిగిన అత్యాచారం ఘటనపై దర్యాప్తు కోసం మహిళా పోలీస్ అధికారిణులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని మద్రాస్ హైకోర్టు పేర్కొంది. అలాగే బాధితురాలికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని శనివారం ఆదేశించింది. తమిళనాడు రాజధాని చెన్నైలోని అన్నా యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థినిపై లైంగిక దాడి జరిగింది. బాధితురాలి ఫిర్యాదుతో ఒక వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. విద్యార్థి సంఘాలతోపాటు ప్రతిపక్షాలు ఈ సంఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. కాగా, ఈ కేసు దర్యాప్తును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కి బదిలీ చేయాలంటూ మద్రాస్ హైకోర్టు పిటిషన్ దాఖలైంది. జస్టిస్ ఎస్ఎం సుబ్రమణ్యం, జస్టిస్ వీ లక్ష్మీనారాయణలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై శనివారం విచారణ జరిపింది. కేసు దర్యాప్తు కోసం ముగ్గురు మహిళా ఐపీఎస్ అధికారిణులతో కూడిన సిట్‌ను ఏర్పాటు చేయాలని కోర్టు పేర్కొంది. బాధితురాలికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే బాధిత విద్యార్థిని చదువు ప్రభావితం కాకుండా చూడాలని, అన్నా యూనివర్సిటీ ఆమె నుంచి ఎలాంటి ఫీజులు వసూలు చేయకూడదని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది.

# మన్మోహన్ సింగ్‌కు తుది వీడ్కోలు

**మొదటి పేజీ తరువాయి...**

నివాళులర్పించారు. అంత్యక్రియలకు ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హాజరయ్యారు. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యల్ వాంగ్‌చుక్, విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు. మన్మోహన్ పార్థివదేహాన్ని పార్టీ నేతలు, కార్యకర్తల సందర్శనార్థం శనివారం ఉదయం ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తీసుకువచ్చారు. కాంగ్రెస్ నేతలు రాహుల్, సోనియా, ప్రియాంక గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి తదితరులు నివాళులర్పించారు. తర్వాత అక్కడినుంచి నిగమ్‌బోధ్ ఘాట్ వరకు అంతిమయాత్ర కొనసాగింది. ఈ సమయంలో రాహుల్.. మన్మోహన్ కుటుంబం వెన్నంటే ఉన్నారు. 92 ఏళ్ల మన్మోహన్ సింగ్ వయసురీత్యా తలెత్తిన అనారోగ్య సమస్యలతో గురువారం రాత్రి ఇంటివద్ద అకస్మాత్తుగా స్పృహ కోల్పోయారు. దీంతో కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మన్మోహన్ పదేళ్ల పాటు దేశానికి ప్రధానిగా పని చేశారు. అంతకుముందు ఆర్‌బీఐ గవర్నర్‌గా వ్యవహరించారు. ప్రధానిగా పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక మంత్రిగానూ బాధ్యతలు నిర్వర్తించారు. అంతకుముందు మన్మోహన్ సింగ్ మృతికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంతాపం తెలిపారు. మాజీ ప్రధాని సతీమణి గురుశరణ్ సింగ్, కుటుంబసభ్యులకు బైడెన్ దంపతులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈమేరకు వైట్‌హౌస్ ఓ ప్రకటన విడుదల చేసింది.



## మన్మోహన్‌సింగ్ అంత్యక్రియల విషయంలో వివాదం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 28 (ప్రభాత ఉదయం):** మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అంత్యక్రియలు ఢిల్లీలోని నిగమ్ బోధ్‌లో జరిగాయి. ఆయన స్మారకం కోసం ప్రత్యేకంగా స్థలం కేటాయించాలని, కాంగ్రెస్ పార్టీ కేంద్రప్రభుత్వానికి లేఖ సైతం రాసింది. దీనిపై కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి. కేంద్రం మన్మోహన్‌సింగ్ అంత్యక్రియల విషయంలో సంప్రదాయాలను పాటించడం లేదని కాంగ్రెస్ పేర్కొంది. ఇదే సమయంలో గతంలో కాంగ్రెస్ ఎలాంటి సంప్రదాయాలు పాటించిందో తెలుసుకోవాలని బీజేపీ నేతలు కౌంటర్ ఇచ్చారు. ఈ క్రమంలో ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లో అంత్యక్రియలు జరగని మాజీ ప్రధానుల అంశం తెరపైకి వచ్చింది. దేశ రాజకీయాల్లో ఓ ప్రధాని అంత్యక్రియల విషయం వార్తల్లో నిలవడం ఇదే తొలిసారి కాదు. గతంలో ముగ్గురు ప్రధానుల అంత్యక్రియలు దేశం బయటే జరిగాయి. ఢిల్లీలో అంత్యక్రియలు జరగని ముగ్గురు ప్రధానుల్లో తెలుగువాడు పివి నరసింహారావు కూడా ఉన్నారు. ఆయనపట్ల అప్పట్లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా దారుణంగా వ్యవహరించింది. భారతదేశానికి 1991 నుండి 1996 వరకు భారత ప్రధానిగా పనిచేసిన పీవీ నరసింహారావు 2004 డిసెంబర్ 23న తుదిశ్వాస విడిచారు. ఆ సమయంలో ఢిల్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ ఉన్నారు. పీవీ నరసింహారావు అంత్యక్రియలు ఢిల్లీలోనే నిర్వహించాలని ఆయన కుటుంబ సభ్యులు తొలుత భావించారు. కానీ,



కాంగ్రెస్‌లోని కొందరు సీనియర్ నేతలు పీవీ అంతిమ సంస్కారాలు హస్తినలో కాకుండా హైదరాబాద్‌లో నిర్వహించేలా అధిష్ఠానంపై ఒత్తిడి తీసుకువచ్చారు. ఈ అంశంపై ఢిల్లీలో ఎన్నో చర్చలు జరిగాయి. అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ సైతం పీవీ అంత్యక్రియలు ఢిల్లీలో నిర్వహించేందుకు సానుకూలంగా ఉన్నప్పటికీ పార్టీలో సీనియర్ల నుంచి వచ్చిన ఒత్తిడితో ఏమి చేయలేకపోయారని అప్పట్లో మన్మోహన్ సింగ్ మీడియా సలహాదారుగా ఉన్న సంజయ్ బారు గతంలో చెప్పిన విషయం తెలిసిందే. చివరకు పీవీ అంత్యక్రియలు హైదరాబాద్‌లో నిర్వహించారు. కాంగ్రెస్ హయాంలో ఢిల్లీలో పీవీ నరసింహారావు స్మారకం నిర్మించాలనే చర్చ జరిగినప్పటికీ నిర్మాణం కాలేదు. తెలంగాణాకు చెందిన పీవీ నరసింహరావు దేశ ప్రధానిగా సేవలు అందించినప్పటికీ ఆయన అంత్యక్రియలు ఢిల్లీలో జరగలేదు. 1989 నుంచి 1990 వరకు భారత ప్రధానిగా పనిచేసిన వీపీ సింగ్ 2008లో ఢిల్లీలో మరణించారు. ఢిల్లీలో ఆయన అంత్యక్రియలు నిర్వహిస్తారనే చర్చ జరిగింది. చివరికి ఆయనను అలహాబాద్‌కు తీసుకెళ్లారు. ఆ సమయంలో కుటుంబ సభ్యుల కోరిక మేరకు అంత్యక్రియలు ప్రయాగ్‌రాజ్‌లోని సంగం ఒడ్డున నిర్వహించారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించగా.. ప్రభుత్వ ప్రతినిధిగా అప్పటి కేంద్రమంత్రి సుభోద్కాంత్ సహాయ్ సింగ్ వీపీ సింగ్ అంత్యక్రియలు హాజరయ్యారు. ఆ తర్వాత స్మారక చిహ్నం ఢిల్లీలో నిర్మించాలనే ప్రయత్నం చేసినా నిర్మాణం జరగలేదు. 1977 నుండి 1979 వరకు ప్రధానమంత్రిగా పనిచేసిన మొరార్జీ దేశాయ్ 1995లో ముంబైలోని జస్లోక్ ఆసుపత్రిలో కన్నుమూశారు. మొరార్జీ కుటుంబ సభ్యుల కోరిక మేరకు సబర్మతి ఒడ్డున ఆయన అంత్యక్రియలు జరిగాయి. మొరార్జీ అంత్యక్రియలకు అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు హాజరయ్యారు. అంత్యక్రియల అనంతరం మొరార్జీ చితాభస్మాన్ని ఢిల్లీకి తరలించారు. మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, చంద్రశేఖర్, చౌదరి చరణ్ సింగ్, రాజీవ్ గాంధీ, ఐకే గుజ్రాల్, అటల్ బిహారీ వాజ్‌పేయి అంత్యక్రియలు ఢిల్లీలోనే జరిగాయి. వీరిలో నెహ్రూ, శాస్త్రి, ఇందిరాగాంధీ, చౌదరి చరణ్, చంద్రశేఖర్, రాజీవ్ గాంధీ, అటల్ బిహారీ వాజ్‌పేయి స్మారకాలకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించారు. ఈ ప్రధానులతో పాటు సంజయ్ గాంధీ అంత్యక్రియలు రాజ్‌ఘాట్‌లో నిర్వహించారు.



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసిన ఆల్వాల్ డివిజన్ అసోసియేషన్


## స్వచ్ఛ హైదరాబాద్ కోసం కాలనీ అసోసియేషన్లు చేస్తున్న కృషి అభినందనీయం: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, డిసెంబర్ 28(ప్రభాత ఉదయం) అల్వాల్ డివిజన్ పరిధిలోని ఇందిరా నగర్ కమ్యూనిటీ హాల్లో జరిగిన "స్వచ్ఛ హైదరాబాద్ జీరో వేస్ట్ బై 2027" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి. ప్లాస్టిక్ వినియోగం తగ్గించుకోవాలని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి తనను ముఖ్య అతిథిగా ఆహ్వానించినందుకు సంతోషంగా ఉందని, ఇలాంటి కార్యక్రమాలకు తనవంతు సహకారం ఎప్పటికీ ఉంటుందని, ముఖ్యంగా ప్లాస్టిక్ నివారణపై అవగాహన పెరగలాని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరా నగర్ అధ్యక్షులు లక్ష్మణ్ రావు, అరుణ్ కుమార్, పెద్ది రమేష్, బ్రహ్మాచారి, బి.ఆర్.ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## పాప విముక్తి కోసం శని అనుగ్రహం అవసరం: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

### శని త్రయోదశి సందర్భంగా భారీ ఏర్పాట్లు చేసిన కోయ దొర శంకర రాజు ముఖియా

శంషాబాద్, డిసెంబర్ 28( ప్రభాత ఉదయం) శని త్రయోదశి సందర్భంగా శనీశ్వర స్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులతో శంషాబాద్ మండలంలోని మదనపల్లి శనీశ్వర ఆలయం కిటకిటలాడింది. శ్రీగిరి పీఠం వ్యవస్థాపకులు కోయదొర శంకర రాజు ముఖియా ఆధ్వర్యంలో శని త్రయోదశి సందర్భంగా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. రంగారెడ్డి హైదరాబాద్ మహబూబ్ నగర్ జిల్లాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి శనీశ్వర స్వామికి తైలాభిషేకం నిర్వహించారు. భక్తులు స్వయంగా తైలాభిషేకం చేసిన అనంతరం ఉమామహేశ్వరులను దర్శించుకున్నారు . రాజేంద్రనగర్ శాసనసభ్యుడు ప్రకాష్ గౌడ్ శనీశ్వర స్వామి ని దర్శించుకుని తైలాభిషేకం చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... న్యాయానికి ధర్మానికి ప్రతీక అయిన శని దేవుని భయంతో తప్పులు పాపాలు చేయడానికి వెనుకడుగు వేస్తారని అన్నారు. శని దేవుడిని నమ్ముకుంటే విజయాలు వరిస్తాయని పేర్కొన్నారు. శని త్రయోదశి సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులకు పెద్ద ఎత్తున భోజన వితరణ కార్యక్రమాలను చేపట్టారు. ప్రకాష్ గౌడ్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు గణేష్ గుప్తా. కొడిగంటి చంద్రారెడ్డి. దూడల వెంకటేష్ గౌడ్. దండు ఇస్తారి. మేకల వెంకటేష్ ముదిరాజ్. గడ్డం శ్రీనివాస్ గౌడ్. శ్రీకాంత్ గౌడ్. జగన్ గౌడ్. మక్కూరి శ్రీకాంత్ యాదవ్. బండి శ్రీధర్ యాదవ్. రామనాథ ముదిరాజ్. మైలారం బిక్షపతి. నీళ్ల శ్రీధర్ గౌడ్. జూర్కి రమేష్. తదితరులు పాల్గొన్నారు.



శనీశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## నితీశ్ సెంచరీ.. తగ్గేదేలేదంటూ స్టైల్

### తెలంగాణ సిఎం రేవంత్‌పై అంబటి మరో కామెంట్

**గుంటూరు, డిసెంబర్ 28 (ప్రభాత ఉదయం):** భారత్, ఆస్ట్రేలియా మధ్య మెల్‌బోర్న్‌లో జరుగుతున్న బాక్సింగ్ డే టెస్ట్ మ్యాచ్‌లో తెలుగు కుర్రాడు నితీశ్ రెడ్డి అద్భుతం సృష్టించి శతకం బాదాడు. ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి కష్టాల్లో ఉన్న జట్టును ఆదుకున్నాడు. సీనియర్లంతా నిరాశపర్చినా ఆసీస్ బౌలర్లను ఆడుకున్నాడు. ఒక సిక్స్, 9 ఫోర్లతో సెంచరీతో కదం తొక్కాడు. దీంతో అతడిపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. అయితే, అతడు అర్ధ శతకం నమోదు చేసిన సమయంలో పుష్ప స్టైల్‌లో 'తగ్గేదేలే' అంటూ మేనరిజంతో సంబురాలు చేసుకున్నాడు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. అతడి పుష్ప స్టైల్ సెలబ్రేషన్స్‌పై వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు స్పందించారు. 'ప్రపంచాన్నే ప్రభావితం చేస్తున్న పుష్ప.. హీరోని వేధిస్తూ తెలుగు సినిమాని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్తానంటే నమ్మేదెలా అబ్బా.. ?' అంటూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై సెటైర్లు వేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ పోస్ట్‌కు నితీశ్ వీడియోని కూడా షేర్ చేశారు. కాగా, సంధ్యా థియేటర్ ఘటన, అల్లు అర్జున్ అరెస్టు నేపథ్యంలో రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో టాలీవుడ్ ప్రముఖులు సీఎం రేవంత్ రెడ్డిన కలిసిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా కూడా అంబటి ఓ ఆసక్తికర ట్వీట్ పెట్టారు. 'పూర్తి పరిష్కారానికి 'సోఫా' చేరాల్సిందే..!' అంటూ ఆయన పెట్టిన పోస్టు సంచలనం రేపింది. ఎందుకంటే.. పుష్ప-2 మూవీలో 'సోఫా' సీన్లు ఉంటాయన్న విషయం తెలిసిందే. తనకు వ్యతిరేకంగా ఉన్న వాళ్లను కొనేందుకు, అనుకూలంగా పనిచేసేవాళ్లకు పుష్పరాజ్ 'సోఫా' పంపిస్తుంటారు. అందులో పెద్ద మొత్తంలో డబ్బు ఉంచి లంచంగా ఇస్తుంటారు. ఇదే అంశాన్ని అంబటి రాంబాబు ప్రస్తావిస్తూ.. 'సోఫా' పంపితేనే సినీ ఇండస్ట్రీ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందంటూ వ్యాఖ్యానించారు. ఈ ట్వీట్ చూసిన నెటిజన్లు రకరకాలుగా స్పందించారు. 'పుష్ప వివాదానికి.. పుష్పరాజ్ తరహాలోనే పరిష్కారమా..?' అంటూ కామెంట్ల వర్షం కురిపించారు. ఇప్పుడు మరోసారి అదే తరహా ట్వీట్ పెట్టడం చర్చనీయాంశంగా మారింది.

## బొకేల బదులు పుస్తకాలు ఇవ్వండి

**మొదటి పేజీ తరువాయి...**

వచ్చాయి. పుస్తకాలను నమిలి మింగేయాలనేంత క్షుణ్ణంగా చదవాలి. హైదరాబాద్ బుక్ ఫెయిర్ సంప్రదాయబద్ధంగా పుస్తకాల్ని ప్రమోట్ చేస్తోంది. మానవ నాగరికత వర్ధిల్లినంతకాలం పుస్తకాలు ఉంటాయి. ఈ-బుక్స్ కంటే పుస్తకాల్లోనే మజా ఉంటుంది. రచయితతో డైరెక్ట్‌గా మాట్లాడుతున్నట్టు ఉంటుంది. విశ్వం గురించి తెలియాలంటే పుస్తకాలు చదవాల్సిందే. ఈ-పుస్తకాలు చదివితే ఆ ఫీల్ ఉండదని పలువురు చెబుతున్న మాట. పెద్దలు అందరూ యువతను పుస్తకాల వైపు ప్రోత్సహించాలి' అని గవర్నర్ సూచించారు.

# విద్యతో పాటు విద్యార్థులను క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రోత్సహించాలి



వివిధ వేషాధరణలో చిన్నారులు



మండల ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడల ప్రారంభోత్సవంలో ఎంఈఓ శంకర్ రాథోడ్

## ఎంఈఓ కె. శంకర్ రాథోడ్ రాజేంద్రనగర్ మండలంలో... ప్రైవేట్ పాఠశాలల స్నేహభావకాలు అభినందనీయం గుర్తింపు పొందిన పాఠశాలల మండల స్థాయి క్రీడోత్సవాల్లో ఎంఈఓ కె. శంకర్ రాథోడ

రాజేంద్రనగర్, డిసెంబర్ 28(ప్రభాత ఉదయం) చిన్నారులను ఆట, పాటలతో కూడిన ప్రదర్శనల పట్ల ఆకర్శితులను చేస్తూ వారిలో చదువు పై ఆసక్తి కలిగించేలా ప్రోత్సహించాలని రాజేంద్రనగర్ మండల విద్యాశాఖ అధికారి కె. శంకర్ రాథోడ్ సూచించారు. రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం తమ తమ పాఠశాలల మధ్య పోటీతత్వ పోకడలను పక్కన పెట్టి మండల స్థాయి క్రీడా పోటీలను ఉమ్మడిగా నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. శనివారం రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో అత్తాపూర్ రాంబాగ్ సమీపంలోని హైదరాబాద్ స్పోర్ట్స్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన మండల స్థాయిల క్రీడోత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శంకర్ రాథోడ్ మాట్లాడుతూ ...తాను మొదటి సారి ప్రైవేట్ పాఠశాలలు ఉమ్మడిగా కలసి మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించడం చూస్తున్నాన్నారు. ప్రైవేట్ పాఠశాల నిర్వహకులు తమ ప్రాంతాల్లోని ఇతర పాఠశాలతో పోటీ పడుతూ స్నేహభావాలు కలిగి ఉండడం చాలా అరుదుగా గమనిస్తుంటామన్నారు. కానీ రాజేంద్రనగర్ మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అన్ని పాఠశాలలను ఏకతాటిపై క్రీడా పోటీలకు సన్నద్ధం చేయడం ఇతర ప్రాంతాల పాఠశాలలకు ఆదర్శంగా నిలువనుందన్నారు. ఇక యాంత్రికంగా మారిన మనిషి జీవితంలో సెల్ ఫోన్, టీవీలు భాగంగా మారి పోయాయని, ఆ ఫలితం విద్యార్థుల పై చేడు ప్రభావాలను చూపే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని గుర్తు చేశారు. చిన్నారులను తల్లిదండ్రులు ఎంత గరాభం చేసినా సెల్ ఫోన్ లు మాత్రం ఇవ్వవద్దని ఆయన సూచించారు. అలాగే ఇంట్లో పిల్లలు చదువుకునే సమయంలో టీవీలు పెట్టి మీరు చూస్తూంటే వారు కూడా ఆ టీవీలకు అలవాటు పడి చదువు పై శ్రద్ధను కోల్పోయే ప్రమాదాలు అధికంగా ఉంటాయన్నారు. నర్సరీ, ఎల్ కె జి, యూకెజి చిన్నారుకు పోటీలు నిర్వహించడం, ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో పోటా, పోటీగా చిన్నారులు ప్రదర్శనలు ఇవ్వడం తల్లిదండ్రులతో పాటు నిర్వాహకులకు ఆనందం పంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడు ఎం. ప్రభాకరాచారి, ప్రధాన కార్యదర్శి జి. శరవణ్ కుమార్, కోశాధికారి ఎస్ఆర్. రజినీ కాంత్, క్రీడా, సంస్కృతిక కార్యదర్శులు వేణుగోపాల్, బోయ లక్ష్మణ్, డాక్టర్ సంజీవ, యాదగిరి, రాంబాబు, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



అత్తాపూర్ నుంచి శబరిమలకు వెళ్తున్న స్వాములు
స్వాములకు సన్మానం చేస్తున్న వనం శ్రీరామ్ రెడ్డి

# అత్తాపూర్ నుంచి శబరిమలకు బయలు దేరిన అయ్యప్ప స్వాములు

బుద్వేల్, డిసెంబరు28(ప్రభాత ఉదయం): అత్తాపూర్ డివిజన్ పాండురంగానగర్, రాంబాగ్ బస్తీల నుంచి శనివారం 200 మంది అయ్యప్ప స్వామీ భక్తులు శబరిమలకు బయలుదేరి వెళ్లారు. వారికి అత్తాపూర్ డివిజన్ నాయకుడు వనం శ్రీరాంరెడ్డి సన్మాణం చేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. శబరిమల కు క్షేమంగా వెళ్లి లాబంగా రావాలని కోరారు. నలభై రోజుల పాటు కఠోర ఉపవాస దీక్ష లు చేపట్టే అయ్యప్ప స్వాములు శబరిమలలో పూజలు చేసి అత్తాపూర్ ప్రాంతం క్షేమంగా ఉండేలా ప్రార్ధించాలన్నారు. కార్యక్రమంలో భక్తులు భరత్ సారంగి, శ్రీనివాస్ గౌడ్, శంకర్, నాగేశ్, వెంకటేశ్వర్రెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థినిలను అభినందించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు

గద్వాల టౌన్, డిసెంబర్ 28(ప్రభాత ఉదయం) హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని ఎన్టీఆర్ గార్డెన్లో ఈనెల 19 నుండి 29 వరకు నిర్వహిస్తున్న వొకేషనల్ ఎగ్జిబిషన్‌లో గద్వాలలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలు చరిత్ర సృష్టించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జహిరుద్దీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గైడ్ టీచర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈనెల 26న ఎగ్బిబిషన్ లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు రూపొందించిన డ్రెస్ మెటీరియల్ ప్రదర్శించడంతో ప్రక్షేకులను, వీక్షకులను ఆకట్టుకుంది. ఎగ్జిబిషన్ కు వచ్చిన వీక్షకులు డ్రెస్ మెటీరియల్ మొత్తాని కొనుగోలు చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థినిలను, ఒకేషనల్ టీచర్ విజయలక్ష్మి లను హెచ్ఎంతో పాటు ఉపాద్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజనందం,అరుణశ్రీ, తదితర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# నూతన సంవత్సర వేడుకలలో అనుమతి తీసుకుని తెలంగాణ మద్యాన్ని మాత్రమే వాడాలి



శంషాబాద్ ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్ దేవేందర్ రావు

రాజేంద్రనగర్, డిసెంబరు 28 (ప్రభాత ఉదయం): శంషాబాద్ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2024 సంవత్సరంలో ఇప్పటి వరకు 171 కేసులను నమోదు చేయడం జరిగిందని స్టేషన్ హౌజ్ ఆఫీసర్ గంద్ర దేవేందర్ రావు తెలిపారు. ముఖ్యంగా వీటిలో సుంకం చెల్లించని మద్యం కేసులు 21, గంజాయి మొదలగు నార్కోటిక్ డ్రగ్ కేసులు 37కేసులు ఉన్నాయన్నారు. వీటిలో 114వ్యక్తులపై కేసులు పెట్టడం జరిగిందన్నారు. ఎన్డీపీఎల్, ఎన్డీపీఎస్ వంటి కేసులలో ఉన్నవారి పట్ల కఠినమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. నూతన సంవత్సర వేడుకలలో డ్రగ్స్ కానీ సుంకం చెల్లించని మద్యాన్ని వాడితే కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయడం జరుగతుందన్నారు. శంషాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న వారికి తెలియజేయడమేమనగా, డిసెంబరు 31రోజు ఈవెంట్ చేసుకునే ఫంక్షన్ హాల్స్, కన్వెన్షన్స్, ఫామ్ హౌజెస్, రిసార్ట్స్, కమ్యూనిటీ క్లబ్స్ వారు ఎక్సైజ్ శాఖ నుంచి లిక్కర్ ఈవెంట్ పర్మిట్ తప్పని సరిగా తీసుకోవాలన్నారు. తెలంగాణ మద్యాన్ని మాత్రమే వాడాలన్నారు. సుంకం చెల్లించని మద్యం. డ్రగ్స్ వాడుతున్నట్లు ఎవరికైన సమాచారం తెలిస్తే 8712658750 నెంబర్ కు సమాచారం అందిం చాలని ఆయన ప్రజలకు సూచించారు.



# శ్రీ మల్దకల్ తిమ్మప్ప స్వామిని దర్శించుకున్న శ్రీ రమ్య ఇండస్ట్రీస్ అధినేత బండ్ల రాజశేఖర్ రెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 28(ప్రభాత ఉదయం)మల్దకల్ మండల కేంద్రంలో వెలసిన స్వయంభూ శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని శనివారం శ్రీరమ్య ఇండస్ట్రీస్ అధినేత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండ్ల రాజశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ తిమ్మప్ప స్వామిని దర్శించుకున్నారు. వారికి ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు అర్చకులు ఘనంగా స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు చేయించారు. అనంతరం స్వామి వారి శేష వస్త్రం వారిని సన్మానించారు. వారి వెంటా కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని దాడులు

## పలువురికి తీవ్ర గాయాలు

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 28(ప్రభాత ఉదయం) తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని ఇరువురు కుటుంబాల మద్య వాగ్వివాదం దాడులకు దారీ తీసింది. డబ్బులు ఇవ్వకపోవడంతో కట్టెలతో దాడులకు పాల్పడగా పలువురికి గాయాలయ్యాయి. ఈ దాడులో ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాల్లోకెళ్లితే మల్దకల్ మండలం పావనంపల్లి గ్రామానికి చెందిన పరుశరాముడు అన్న తెలుగు తిమ్మప్ప తన సమీప బంధువైన రాజప్పతో కొన్నేండ్ల క్రితం రూ.30వేలు బదులుగా తీసుకున్నాడు. మూడేండ్ల క్రితం తెలుగు తిమ్మప్ప మృతి చెందాడు. తిమ్మప్ప తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించాలని రాజప్ప మరియు కుటుంబ సభ్యులు తరుచు పరుశరాముడు కుటుంబ సభ్యులతో గొడవ పడే వారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి పరుశరాముడు కుటుంబ సభ్యుల పై రాజప్ప, అతని కుటుంబ సభ్యులు కట్టెలతో దాడికి పాల్పడారు. ఈ దాడుల్లో పరుశరాముడుతో పాటు తల్లి సరోజమ్మలకు తీవ్రగాయాలయ్యాయి. పరుశరాముడు కుటుంబ సభ్యులైన పుణ్యవతి, సరస్వతి, రాఘవేంద్రలు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని వైద్యం కోసం గద్వాల ఆసుపత్రికి తరలించారు. సరోజమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూల్ ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితుడు పరుశరాముడు మల్దకల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో మల్దకల్ పోలీసులు రాజప్ప, బీసన్న, వారి కుటుంబ సభ్యులు ఆంజకుటుంబ, శివకృష్ణ, రేషమ్మ, జయలక్ష్మీ, మహేశ్వరిలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నందీకర్ తెలిపారు.



ప్రారంభానికి సిద్ధమైన నూతన రాజేంద్రనగర్ కోర్ట్ భవనం

# రాజేంద్రనగర్ మెట్రోపాలిటన్ కోర్టు అద్దె భవనంలోకి నూతన కోర్టుల తరలింపు

## ఈ నెల 30 నుంచి కొనసాగింపు

రాజేంద్రనగర్, డిసెంబర్ 28(ప్రభాత ఉదయం) రాజేంద్ర నగర్ ఉప్పరపల్లి మెట్రోపాలిటన్ కోర్టు నూతన అద్దె భవనంలోకి కోర్టు సముదాయాన్ని మార్చడం జరిగిందని ఉప్పరపల్లి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శీలం వెంకట్ రెడ్డి తెలిపారు. ఈనెల 30వ తేదీ సోమవారం మంచి కార్యక్రమాలు కొనసాగు తాయని శీలం వెంకట్ రెడ్డి వివరించారు. ఉప్పర పల్లిలోని క్రికెట్ గ్రౌండ్‌లో నిర్మించిన అద్దె భవనంలోకి మార్చడం జరిగిందని,సోమవారం నుంచి మార్చబడిన కొత్త కోర్టులో కేసులు యధావిధిగా కొనసాగుతాయని వెల్లడించారు.ప్రజలు విషయాన్ని గ్రహించాలని సూచించారు.




సీఎం కప్ హాకీ గవర్నమెంట్‌లో ఫైనల్ కు చేరిన జట్టు

# రాష్ట్రస్థాయి సీఎం కప్ హాకీ టోర్నమెంట్లో సెమీఫైనల్స్‌కి మహబూబ్‌నగర్ జిల్లా హాకీ జట్టు

మహబూబ్ నగర్, డిసెంబర్ 28(ప్రభాత ఉదయం) హైదరాబాద్ గచ్చిబౌలి స్పోర్ట్స్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సీఎం కప్ హాకీ టోర్నమెంట్లో రెండవ రోజు మహబూబ్ నగర్ జిల్లా హాకీ జట్టు సెమీఫైనల్ కి చేరింది.. రెండవ రోజు నిజామాబాద్, అదిలాబాద్ జిల్లా జట్లతో క్రీడాకారులు అత్యున్నత మైన ప్రదర్శన కనబరిచి విజయం సాధించి సెమీ ఫైనల్స్ కి అర్హత సాధించారు. ఆదివారం రేపు నల్గొండ ,మహబూబ్ నగర్ జిల్లా జట్లు సెమి ఫైనల్స్ లో ఆడవలసి ఉందని తెలంగాణ రాష్ట్ర హాకీ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ బొలమోని కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాకీ జట్టు కోచ్ మన్యం యాదవ్, కోశాధికారి నిరంజన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆరాంఘర్ చౌరస్తా లో ట్రాఫిక్ ను క్రమబద్ధీకరణ చేసి ప్రయాణికులకు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించిన ప్రైవేటు సంస్థ సభ్యులు



# ట్రాఫిక్ క్రమబద్ధీరణలో ఎస్సీఓలు

బుద్వేల్, డిసెంబరు28(ప్రభాత ఉదయం): సోసైటీ ఫర్ సైబర్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ) వాలీంటర్లు శనివారం ఆరాంఘర్ చౌరస్తాలో ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ, ఇన్స్ పెక్టర్ రాజేందర్ గౌడ్, ఆర్ఐ గణేశ్, ఏఎస్ఐ రాంప్రసాద్ సిబ్బందితో కలసి ఎస్సీఎస్సీ సంస్థకు చెందిన 20 మంది వాలీంటర్లు రెండు గంటల సేపు ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో పాలు పంచుకున్నారు. ట్రాఫిక్ నియమాలతో పాటు సైబర్ నేరాల పై ప్రయాణికులకు, ప్రజలకు అవగాహన కల్పించారు.



## రతన్ టాటా, మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్, పీజేఆర్ సేవలు మరువలేనివి

**పాపిరెడ్డి నగర్ కాంటెస్టింగ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి**

కూకట్‌పల్లి,డిసెంబర్ 28 (ప్రభాత ఉదయం) శేరిలింగంపల్లి నియోజకవర్గం కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్ లో పారిశ్రామిక వేత్త రతన్ టాటా జయంతి, మాజీ ప్రధానీ మన్మోహన్ సింగ్ అంతిమ యాత్ర, పి జె ఆర్ వర్ధంతి సందర్భంగా ఈ ముగ్గురు మహనీయుల చిత్ర పటానికి పాపిరెడ్డి నగర్ కాంటెస్టింగ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో తన కార్యాలయం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ సామాజిక వ్యాపారవేత్త రతన్ టాటా తనకు వచ్చిన ఆదాయంలో సగానికి పైగా చారిటబుల్ ట్రస్టుల ద్వారా వైద్య, విద్యకు సంబంధించి కొన్ని వేల మందికి సహాయాన్ని అందించటమే కాకుండా కొన్ని లక్షల మందికి ఉద్యోగాలు కల్పించి ఉపాధి అవకాశాలను కల్పించారని అన్నారు. అదే విధంగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఆర్బీఐ గవర్నర్ గా, దేశ ఆర్థిక మంత్రిగా, ఒక ప్రధాన మంత్రిగా ఆయన సేవలను దేశానికి అంకితం చేశారని తెలిపారు. దేశంలో ఆర్థిక వ్యవస్థను మెరుగు పరిచారు. పేదల పెన్నిధి స్వర్గీయ పీ. జనార్దన్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కార్మిక మంత్రిగా పేదల పక్షపాతిగా నిలుస్తూ మెట్రో రైలు ప్రాజెక్టు కోసం పోరాడిన ఏకైక గొప్ప వ్యక్తి పీజేఆర్ అని శ్రీధర్ రెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ రెడ్డి భూపాల్ రెడ్డి, చర్ల రామకృష్ణారెడ్డి, గంగుల రాజిరెడ్డి, గడ్డం రాజేశ్వర్ రెడ్డి, మాయ బాల నరసయ్య, చిట్టిరెడ్డి గోపాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, శరత్ రెడ్డి, వీరన్న, వెంకట్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, గడ్డం సునీల్, యాదగిరి వడ్డెర, మహేందర్ రెడ్డి, బుచ్చి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సాయి బాబా, స్వామి, కృష్ణ రెడ్డి, సంపత్ గౌడ్, రంగా రెడ్డి, రాజు, రమేష్ చారీ, నారాయణ రెడ్డి మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.



స్వర్గీయ మాజీ సి ఎల్ పి లీడర్ పిజెఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## పేద ప్రజల కోసం అహర్నిశలు పాటుపడిన మహనీయుడు

**ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి... పీజేఆర్‌కి ఘనంగా నివాళులు...**

కూకట్‌పల్లి, డిసెంబర్ 28 (ప్రభాత ఉదయం) పేద ప్రజలు, కార్మికుల జీవితాల్లో పి.జనార్ధన్ రెడ్డి ఇంకా చిరస్థాయిగా నిలిచిపోయే ఉన్నారని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పి.జనార్ధన రెడ్డి వర్ధంతి పురస్కరించుకుని శనివారం కాంగ్రెస్ నేతలు బాలానగర్ లో ఘనంగా నిర్వహించారు. పీజేఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత పులి శ్రీకాంత్ పటేల్, బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధు గౌడ్, కూకట్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కొండకింది పుష్పరెడ్డి, పులి శివకుమార్ గౌడ్, దళిత నేత మధు మోహన్, రవి ముదిరాజ్, సాగర్ గౌడ్, రవి చంద్ర గౌడ్, బాతుల అనిల్, సత్యాపాల్ రెడ్డి, రామ్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాసులు

## సైబర్ నేరాలపై అవగాహన

గద్వాల(కేటిదొడ్డి), డిసెంబర్ 28(ప్రభాత ఉదయం) కేటిదొడ్డి మండలం గువ్వల దిన్నె గ్రామంలో శనివారం ఎస్ఐ బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మండల ప్రజలు తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని, ఫోన్లో ఓటీపీలను ఇతరులకు చెప్పొద్దన్నారు. కేవైసీలను అప్డేట్ చేయమని వచ్చే మెసేజ్లు, సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబర్కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# స్మశాన వాటిక పరిశుభ్రంగా ఉండేలా చూడాలి

## ఎమ్మెల్యే మల్లి రాజశేఖర్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు



మల్కాజిగిరి, డిసెంబర్ 28(ప్రభాత ఉదయం) స్మశాన వాటికలో మున్సిపల్ సిబ్బంది పరిసర ప్రాంతాల చెత్తాచెదారాన్ని వేస్తూ డంపింగ్ యార్డ్ గా మార్చారని ఈ స్మశాన వాటికను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే మల్రి రాజశేఖర్ రెడ్డిని కోరారు. శనివారంమచ్చ బొల్లారం డివిజన్ పరిధిలోని రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మల్రి రాజశేఖర్ రెడ్డి కలవడం జరిగింది.మచ్చ బొల్లారంలోని మోతులకుంట చెరువు సమీపంలోని సర్వే నెంబర్ 198 %ఛ% 199 లలో హిందూ శ్మశానవాటికను అల్వాల్ మున్సిపల్ శాఖ వారు పూర్తిగా డంపింగ్ యార్డు గా మార్చారని, తద్వారా చుట్టు ప్రక్కన గల 50 కాలనీల ప్రజలు ఆరోగ్య పరమైన సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఆ ప్రాంతం మొత్తం కాలుష్య బరితంగా మారిందని, అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోకుండా హిందూ శ్మశానవాటికను డంపింగ్ యార్డుగా మార్చి హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఈ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే ను కోరారు.స్పందించిన ఎమ్మెల్యే , ప్రజల ఆరోగ్యం దృష్ట్యా వెంటనే సంబంధిత అల్వాల్ ఎ.ఎం. ఓ హెచ్ రజనీ మరియు రాంకీ కి సంబంధించిన ఇన్చార్జి నజీమ్, సురేందర్ రెడ్డి లతో మాట్లాడి తక్షణమే డంపింగ్ యార్డు ప్రాంతానికి రావాలని తాను కూడా రెసిడెంట్స్ వెల్ఫేర్ అసిసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుల ను తీసుకొని వస్తున్నానని చెప్పారు. అనంతరం స్థానికులు మరియు బి.ఆర్.ఎస్ నాయకులతో డంపింగ్ యార్డు చేరుకున్న ఎమ్మెల్యే . అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి. ప్రతి రోజు డంపింగ్ యార్డులోని చెత్తను ప్రాసెస్ చేసి ఇక్కడి నుండి తరలించాలని, ఎ.ఎం.ఓ. హెచ్ రజనీ ఆదేశించారు ప్రజారోగ్యం దృష్టిలో పెట్టుకొని అధికారులు పనిచేయాలని అన్నారు, అదేవిధంగా డంపింగ్ యార్డులో ఒక్క రోజుకంటే ఎక్కువ సమయం చెత్త నిలువ ఉండరాదని, వీలయినంత త్వరగా చెత్తను ప్రాసెస్ చేసి తరలించాలని రాంకీ అధికారులను ఆదేశించారు, మరో రెండు రోజుల తర్వాత తానే స్వయంగా డంపింగ్ యార్డుకు వచ్చి పరిశీలిస్తానని పరిస్థితి మారకుంటే స్థానిక ప్రజలతో కలిసి అల్వాల్ మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నాకు దిగడం ఖాయమని అన్నారు. ఎమ్మెల్యే స్పందించిన తీరుకు హర్షం వ్యక్తం చేసిన స్థానికులు సమస్యను తెలుసుకున్న వెంటనే పరిష్కారం కోసం కృషి చేయాలనే సంకల్పించుకునే నాయకుడు మాకు ఎమ్మెల్యే గా ఎన్నికైనందుకు సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో 48 కాలనీల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు , బి.ఆర్.ఎస్ నాయకులు డోలి రమేష్, డిల్లి పరమేశ్, శోభన్ బాబు ,మల్లేష్ గౌడ్, యాదగిరి గౌడ్ ,ప్రశాంత్ , నరేష్, జావేద్, తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డికి స్వీట్ తినిపిస్తున్న రియల్ ఎస్టేట్ నూతన కార్యవర్గం

## ఎమ్మెల్యేను సన్మానించిన రియల్ ఎస్టేట్ ఏజెంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 28(ప్రభాత ఉదయం) జిల్లా రియల్ ఎస్టేట్ ఏజెంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొత్తపల్లి ఆంజనేయులు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం గద్వాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ని రియల్ ఎస్టేట్ వ్యాపారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ను వారు శాలువాతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడికి కార్యవర్గ సభ్యులకు హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ రఘు కుమార్ శెట్టి ,రియల్ ఎస్టేట్ సంఘం సభ్యులు ఎస్వీఆర్ రాజు యాదవ్, కేఎన్ఆర్ నరసింహ, బుల్లెట్టు లక్ష్మన్న, హనుమంతు, రామ్ రెడ్డి, రఘు, తిమ్మన్న, రాంమ్మూర్తి, నరసింహ, పిల్లిగుండ్ల గోపాలు, లావు గోపాల్, కృష్ణ, పరశు, మాలిమ్ మబ్బులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆగివున్న లారీని ఢీకొన్న బైక్

**ఇద్దరు యువకుల దుర్మరణం**



పెద్దపల్లి, డిసెంబర్ 28 (ప్రభాత ఉదయం) పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని బంజేరుపల్లి తండా దగ్గర శుక్రవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రిపేర్ కారణంగా రోడ్డు మధ్యలో ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మరణించారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతులను బంజరు పల్లె గ్రామానికి చెందిన రాజశేఖర్ (28), బానోత్ సంతోష్(26) గా గుర్తించారు పోలీసులు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తోన్నట్లు పోలీసులు తెలిపారు.

# పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలి

## 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బీచుపల్లి

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 28(ప్రభాత ఉదయం)104 ఉద్యోగులకు పెండింగ్ లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని 104 ఉద్యోగుల సంఘం (సీఐటీయూ అనుబంధం) జిల్లా అధ్యక్షుడు బీచుపల్లి డిమాండ్ చేశారు. శనివారం పెండింగ్ లో ఉన్న వేతన బకాయిలు విడుదల చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న 104 ఉద్యోగులకు 2024 అక్టోబర్ వరకు ఆరు నెలల వేతనాలు ప్రభుత్వం ఇప్పటివరకు చెల్లించ లేదని అన్నారు. వేతనాల బకాయిలపై గత కొన్ని నెలలుగా చేసిన ఆందోళన ఫలితంగా డిసెంబర్ 4వ తేదీన జీవో ఆర్టీ నెంబర్ 706 విడుదల చేస్తూ ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని అన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన, ఇప్పటివరకు 104 ఉద్యోగులకు వేతనాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అన్ని రకాల ఆరోగ్య సదుపాయాలు అందిస్తున్నప్పటికీ 104 ఉద్యోగుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరి కాదన్నారు. వేతనాలు లేక తాము ఇబ్బంది పడుతుంటే అధికార యంత్రాంగం అదనపు పని భారాలు మోపుతూ, ఈరోజు రేపు అంటూ కాలయాపన చేస్తూ వేతనాలు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 104 ఉద్యోగులను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో ఉన్న కాలేజీలో ఇన్స్టిట్యూట్ లోకి సర్దుబాటు చేస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఇప్పటివరకు అందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేయలేదని, దీనివల్ల ఉద్యోగ భద్రత లేక తాము తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న రూ.12 కోట్ల 56 లక్షల రూపాయలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ 104 ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి అతిక్ ఉపాధ్యక్షులు ఆంజనేయులు కోశాధికారి చందు సహాయ కార్యదర్శిలు నాగన్న, శేఖర్, నరసింహ, చాంద్ భాషా, బాలచంద్రుడు, రవి, ఆంజనేయులు నారాయణ, శ్రీహరి, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బీచుపల్లి

Printed and Published MEKALA DAMODAR REDDY on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231. Cell: 9705231654.